

# ఒక దెయ్యం చెప్పిన రెండు దెయ్యాల కథ

కథ

తురగా కృష్ణ మోహన్ రావు

మా ఇంటిని ఆనుకొని వేపచెట్టు కొమ్మలు రెండు కొట్టేసేవరకు, ఆ చెట్టుమీద దెయ్యాలున్నాయన్న సంగతి నాకు తెలియదు. గాలికి, వర్షానికి రెండుకొమ్మలు విరిగిపోయాయి. ఇంటివాళ్ళబ్బాయి దాసు వచ్చి, ఆ రెండు కొమ్మల్నీ కొట్టేశాడు. అతనికికూడా దెయ్యాలున్న సంగతి తెలియదు. బ్రతికున్న వాళ్ళకంటే, చచ్చిపోయినవాళ్ళంటే గౌరవం ఎక్కువ మనకి. ఆ చెట్టుమీద దెయ్యాలున్న సంగతి తెలిస్తే, మరో వేపచెట్టు చూపించి, మరీ కొట్టేసేవాడు దాసు. మా మధ్యగదిలో కిటికీ పక్కనే ఉంది వేపచెట్టు. కిటికీ ఊచలు దూరదూరంగా ఉన్నాయి. రెండు కొమ్మల్నీ రెండు దెయ్యాలు అంటిపెట్టుకొని ఉన్నాయిట! కొమ్మల్ని కొట్టివేయగానే, రెండుదెయ్యాల్లో ఒకటి కిటికీఊచల మధ్యనుంచి దూరి, పక్కనే వున్న పాత బీరువామీద ఒళ్ళు, మొహం ముడుచుక్కూచుంది. చలేస్తోందిట. అందుకు ఒళ్ళు ముడుచుకొంది. ఫ్రెండు దెయ్యం ఎక్కడికో అతీగతీ లేకుండా పోయిందిట; అందుకని మొహం ముడుచుకుంది.

ఈ విషయాలన్నీ మీకెలా తెలిశాయంటారు. అదే చెప్పబోతున్నాను. ఒక్క నిమిషం ఓపికపట్టండి. ఇది దెయ్యాలతో పని. కొంచెం అటూ ఇటూ ఐతే, ప్రాణం పోతుంది. ఆ తర్వాత మనం కూడా వేపకొమ్మలు వెతుక్కోవలసివస్తుంది. ఈ రోజుల్లో ఇళ్ళు దొరకడం ఎంత కష్టమో, వేపచెట్టు దొరకడంకూడా అంతే కష్టంట! నా ఫ్రెండుదెయ్యం చెప్పింది.

నా ఫ్రెండుదెయ్యం, ఆ రెండోదెయ్యం, రెండూకూడా మగదెయ్యాలే! మగాళ్ళని గురించి రాసేటప్పుడు "చేశాడు, చెప్పాడు" అని రాయాలిట-మా తెలుగుమాష్టారు చెప్పేవారు. దెయ్యాల్ని గురించి రాసేటప్పుడు, 'చేసింది, చెప్పింది' అని రాయాల్సుంటుంది. వెంకటేశ్వర్రావునుగురించి చెప్పేటప్పుడు, 'డు' అంటాను, పుల్లింగం ఉపయోగిస్తూ. వెంకటేశ్వర్రావు దెయ్యాన్నిగురించి రాస్తే, 'ది' అంటాను-స్త్రీలింగాన్ని ఉపయోగించి. 'మగాడి దెయ్యానికి స్త్రీలింగం ఎలా ఉపయోగిస్తావోయ్?' అని అడక్కండి! నేనలా రాయకపోతే, కర్రుచ్చుకు ఏ వేపచెట్టు మీంచో దూకుతుంది మా తెలుగుమాష్టారు!

నాకు దెయ్యాల్లో నమ్మకంలేదు ఒకప్పుడు. దెయ్యాల్లో నమ్మకంసంగతి దేవు

డేరుగు. దెయ్యాలున్నాయనే నమ్మకమే ఉండేదికాదు. కాని, దెయ్యాలంటే భయం మాత్రం బోల్డు. దేముడిలో నమ్మకం వున్నా లేకపోయినా, పెళ్ళాం ప్రసవమయేరోజున కొబ్బరికాయ కొట్టేవాడి భయం అంతటి భయం. అందువల గది తలుపు తెరిచి లైటేసేసరికి, బీరువా పైన దెయ్యం కనుపించేసరికి "హేఁయ్!" అని కేకెట్టాను - దొంగాడో, కుక్కో, పిల్లో అనుకుని.

ఇది మొన్నరాత్రి జరిగింది. కటకటాల తలుపుకి తాళంతీసి, లోపలికి వచ్చాను. ముందుగదిలో లైటేసి. మధ్యగదిలోకి వచ్చాను. చీకట్లో కూడా బీరువామీద ఏదో తెల్లగా కనుపించింది. మామూలుగా రాత్రి వచ్చినప్పుడు, అన్నిగదుల్లో లైటేసి 'హేఁయ్!' అని గట్టిగా అనడం అలవాటు. పిల్లో, కుక్కో ఉంటే దుమికి పారిపోతుంది. పారిపోయిందని రూఢిగా తెలిసిన తర్వాత, కిటికీదగ్గిర కెళ్ళి మళ్ళీ గట్టిగా 'హేఁయ్!' అంటాను. పిల్లి కాక, కుక్కా కాక, యే దొంగాడో ఉంటే ఏమంటానో తెలియదు. 'అమ్మ-బాబోయ్!' అంటానేమో బహుశ. ఆవేళ నేను మధ్యగదిలోకి వచ్చి లైటేసి చూసేసరికి బీరువామీద దెయ్యం కనపడింది! ఒళ్ళు, మొహం ముడుచుకొని కూర్చునుంది.

ఎక్కడో చూసిన మొహంలా ఉంది. కుక్కా కాదు, పిల్లీ కాదు, దొంగాడుకూడా కాదు. దొంగాడైతే మంచంకింద దాక్కోవాలికాని బీరువాఎక్కి కూచోడం న్యాయం కాదు. 'ఒకవేళ కొంపతీసి దెయ్యమా?' అన్న అనుమానం రాలేదు నాకు.

"అదేమిటి? దెయ్యంలా అలా గుడ్లురిమి చూస్తావ్? కిందికి దిగిరా!" అని గదమాయించాను.

"నేను దెయ్యాన్నే మరి" అంది దెయ్యం-వణికిపోతూ.

మరొకరు నాస్థానంలోవుంటే మూర్ఛపోయేవారే! ఒక దెయ్యంవచ్చి, సిగ్గూ ఎగ్గూ లేకుండా, 'నేను దెయ్యాన్నే' అంటూంటే, ఎవడికైనా వస్తుంది మూర్ఛ! కాని నాకు రాలేదు. పైగా - లోపల్నుంచి ఎక్కడలేని ధైర్యం పుట్టుకొచ్చింది. "నువ్వు దెయ్యానివైతే, రుజువేది?" అన్నాను. "దెయ్యానివైతే ఏవూరిదెయ్యానివి?" అని దబాయించాను. "దెయ్యం మొహంలా లేదు నీమొహం!" అని వేళాకోళం చేశాను.

"ఈ చివరిప్రశ్న దెయ్యం ఆత్మగౌరవానికి భంగకరంగా కనుపించుండాలి. అది వణకడం మానేసింది. బీరువా పైనుంచి ఒక్కుదుటున, ఎలక్ట్రిక్ దీపం తాడమ్మటే కిందకిపాకి, అక్కణ్ణించి పాగి, గోడకి నేను వర్గు తగిలించుకొనే మేకు తగిలి వేలాడుతూనుంచుంది.

"ఇప్పుడైనా నీకు నమ్మకం కలిగిందా?" అంది.

నేను తల ఆటూ ఇటూ ఊపాను. అటూ ఊఇటూ కొకుండా పాను. ఒకలాచూస్తే, నమ్మకం కలిగినట్టే అర్థం. మరోలాచూస్తే, కానట్టే అర్థం.

"దెయ్యం అంటే చాలా భయంకరంగా ఉంటుందని నా నమ్మకం. మనుష్యులు కనిపిస్తే, కొమ్ములో పొడిచేసి, కోరలు చూపెట్టి. తొండాలతో చావమోది, వెనకాళ్ళతో తన్ని, తోకాడించి, చచ్చేట్టు కరిచేస్తాయని నా నమ్మకం. కళ్ళతో నిప్పులు కురిపించేస్తాయని, శ్వాసలతో ఆవిరిచేస్తాయని, వేసున్న తలుపులోంచి మాయమై, అడ్డంగాఉన్న గోడల్లోంచి బయటకొచ్చేస్తాయని నా నమ్మకం."

గుక్క తిప్పుకోకుండా చెప్పేశాను - తల పంకిస్తూ.

దెయ్యం నీరసంగా వికటాట్టహాసం చేసింది. మేకువదిలి, గాలిలో ఎగిరెళ్ళి, కిటికీఊచలలోంచి తల బయటకు పెట్టి తొంగి చూసి, వెనక్కి తిరిగింది.

"ఇప్పుడు నేను చాలా దారుణమైన పరిస్థితిలో ఉన్నాను. మా ఫ్రెండు దెయ్యం అతీగతీ లేకుండా పోయింది. ఏంచేయాలో తోచడంలేదు. లేకుంటే, నీమాటలకు పొట్ట చెక్కలయ్యేటట్టు నవ్వేదాన్ని" అంది.

నేను మాట్లాడలేదు. దెయ్యం మొహం చూస్తే, ఏదో చెప్పదలచుకున్నట్టు కనపడింది. పడక్కుర్చీ లాక్కుని కూచున్నాను. సిగరెట్టు అంటించుకున్నాను. దెయ్యం నా మొహంవైపు, నా సిగరెట్ వైపు అదోలా చూసింది. గాలిలో అటూ ఇటూ పచార్లు చేస్తూ మాట్లాడడం ప్రారంభించింది.

"నేనెవరో నీకు తెలియదు కాదూ? తెలియదు. మర్చిపోయావ్. అలా వుంటుంది లోకం - చచ్చిందైనా, బ్రతికిందైనా! ఈ విషయంలో మాలోకానికి మీలోకానికి తేడాలేదు. నా పేరు వెంకటేశ్వర్రావు. ఇప్పటికైనా జ్ఞాపకంవచ్చానా? లేదు. నువ్వు నాకు బాగా జ్ఞాపకం ఉన్నావ్. నువ్వు, నేను, శంకరం - ముగ్గురం ఒకే క్లాసులో ఉండేవాళ్ళం. జ్ఞాపకం తెచ్చుకో. ఒకసారి తెలుగుమాష్టారి క్లాసులో నీపిలక్కి రాయి కట్టాను తాడుపెట్టి. పిలక లాగినట్టయితే, మేష్టారికి ఫిర్యాదు చేయబోయావ్ 'మేష్టారు! వెనకాల పిలక...' అంటూ ఏదో అనబోతూంటే, పిల్లలు గొల్లుననవ్వారు. ఆనవ్వులో కలిసిపోయాయి నీమాటలు. తన పిలకను గురించి చెబుతున్నావేమో అనుకొని మాష్టారు నిన్ను కొట్టారు. నువ్వు లేవగానే, నీ పిలక్కున్న రాయి కనపడేసరికి, పిల్లలు మళ్ళీ నవ్వారు. 'పోయి నీసీట్లో కూచో' అని నిన్ను గదమాయిస్తూ, మేష్టారు నీవీపుమీద ఒక్క చరుపు చరిచారు. ఆయనచేతికి నీ పిలక్కున్న రాయి తగిలింది. మేష్టారు నవ్వడం ప్రారంభించారు. మేష్టారి నవ్వు చూచి నువ్వు ఆశ్చర్యపోయావ్, తరవాత ఏడవడం ప్రారంభించావ్. నేనూ శంకరం నవ్వాపుకోలేక చచ్చాం...జ్ఞాపకమొచ్చానా?" అంది దెయ్యం.

దెయ్యం నవ్వడంలేదు. కాని దానికి అంతకుముందున్న నీరసం ఎక్కడికో పోయింది. నాకు ఆ సంఘటన బాగా జ్ఞాపకముంది: వెంకటేశ్వర్రావు, శంకరం - వీళ్ళిద్దరూ చిన్నప్పుడునుంచీ నన్ను పీడించుకు తినేవారు. అదంతా తలచుకొంటే, నాకు రోషం రావలసింది. వెంకటేశ్వర్రావు



# ఒకదెయ్యంచెప్పిన రెండుదెయ్యాలకథ

చచ్చిపోయాడన్న మాట! వీడు చస్తే, దెయ్యమౌతాడని ఎప్పుడో అనుకున్నాను. మరి-శంకర్రావు ఎక్కడున్నాడో! ఇందాకా దెయ్యం ఏదో చెప్పిందికాని ఏం చెప్పిందో అసలు చెప్పిందో లేదో, గుర్తులేదు. వీళ్ళిద్దరు ఒకే రకం. ఎప్పుడూ కలిసుండే వారు. ఒకేలా ఉండేవారు, ఒకేలా ఆలోచించే వారు. ఒకే కొంపె చేపలూ తిన్నాను. పైగా - ఒకడు చస్తే, రెండోవాడు బతికుండడం ఏమిటి? కాస్సేపు.

"శంకర్రావు ఏమయ్యాడు?" అని అడిగాను దెయ్యాన్ని.

దెయ్యం పచార్లు చెయ్యడం మానేసింది. మానేసి నా కళ్లలోకి తీవ్రంగా చూసింది. కళ్ళమ్మట నీళ్లు కారుతున్నాయి. నీళ్ళు కాదు, రాళ్ళు. దెయ్యం నిట్టూర్పింది. మనం నిట్టూరిస్తే, ఆవిరిలా వేడిగా బయట కొస్తుంది నిట్టూర్పు. దానికి కారణం మనం ఘనపదార్థాలం కావడంవలట! దెయ్యం వాయుపదార్థం కాబట్టి అది నిట్టూరిస్తే, ఏవేవో రకరకాల ఘనపదార్థాలు నేలమీద పడ్డాయి.

దెయ్యం అంది: "శంకర్రావు కూడా ఇందాకటి దాకా నాతోటే ఉంది. అది పైకొమ్మమీద ఉండేది, నేను కింద కొమ్మ మీద ఉండేదాన్ని. కొమ్మలు కొట్టేయగానే ఎక్కడికో అతీగతీ లేకుండా పోయింది. ఏమైందో తెలియదు. ఎం చేయాలో తెలియదు."

దెయ్యం ముక్కు తుడుచుకొని, తల కిందుగా వేలాడుతూ బావురుమని ఏడవడం ప్రారంభించింది. నాకు జాలి కలగ లేదు. నేను అసమర్థుణ్ణి పోగాక! దెయ్యం సమర్థతెక్కడ కనుపిస్తోంది?

"నేను నమ్మను" అన్నాను దెయ్యంతో.

సిగరెట్టు పొగ పీల్చి దాని మీదికి వదిలాను.

"పొగ మీదకి వదలకు" అంది దెయ్యం—కోపంగా.

"ఏం?" అన్నాను నేను.

"దెబ్బ తగుల్తోంది" అంది దెయ్యం. దెయ్యం వాయుపదార్థం అన్న సంగతి మరిచిపోయాను నేను. "పోనీ, అలాగే లే. వదలనులే!" అన్నాను.

దెయ్యం మెకు తిగొచ్చింది. "ఏం? ఎందుకు నమ్మవ్?" అంది నెమ్మదిగా.

"ఎందుకంటే - దెయ్యాలనేవి ఉన్నాయని నేను నమ్మను కనుక, దెయ్యాలున్నా వేపచెట్ల మీద ఉంటాయని ఒప్పుకోను కనక. వేపచెట్ల మీద ఉన్నా, కొమ్మ విరిగిపోతే మరో కొమ్మమీదకు పోవాలిగాని, అతీగతీ లేకుండా పోవడం అసంబద్ధం, అర్థరహితం, అసందర్భమూ కాబట్టి. అర్థమైందా?"— నేను తీవ్రంగానే అన్నాను. కోపం వస్తే మనిషిని కాను మరి.

దెయ్యం నావైపు తేరిపార చూసింది. చూసి, అంది: "నిన్ను పిచ్చాడనాలో, వెర్రాడనాలో అర్థం కావడం లేదు. నువ్వు మొదట్నుంచీ ఇంతే. మీ మనుష్యుల అభిప్రాయాలే విచిత్రంగా ఉంటాయి. నువ్వో తలక్రిందులు మనిషివి. బతుకున్న మనుష్యుల్లోనైతే బతక లేక చస్తున్నావ్. చచ్చిన దెయ్యాలతో ఎలా వేగగలవ్?

"నేను దెయ్యాన్ని. నీకు ఎదురుగుండా కనిపిస్తున్నాను. ఐనా—దెయ్యాల్లో నమ్మకంలేదంటావ్. నేను వేపచెట్టుమీంచి దూకొచ్చాను. చావలేక బతుకుతూన్న పిచ్చినమ్మకాల మనుషుల మాటలు పట్టుకొని వేపచెట్ల మీద దెయ్యాలుండవంటావ్. కొమ్మ విరిగితే, శంకరం అతీగతీ లేకుండా పోయింది. ఐనా-అది అసందర్భం అంటావ్ ఏది సందర్భమో ఏవిటో నీకు తెలుస్తున్నట్టు

"నేనూ ఒకప్పుడు మనిషినే. మనిషిగా ఉన్నప్పుడు దెయ్యాలనేవి ఉన్నాయని నేను నమ్మలేదు. నేనూ, శంకరం, కలిసి మెలిసి ఉండే వాళ్ళం, చదువైపోయింతర్వాత కూడా మేం సైంటిస్టులం. మా బుర్రలకు తటనివి, మేము నమ్మని బుర్రలకు తట్టనివి మేము ఒప్పుకొనే వాళ్ళం కాదు. మా ఆలోచనా విధానాన్ని మేము హేతువాదం అనుకునే వాళ్ళం."

"ఏడవలేక పోయారు" అనుకున్నాను నేను—మనస్సులో. పైకి అంటే, దెయ్యం చంపేస్తుంది, కాని మనస్సులో అనుకున్నవి కూడా రేడియోలో వినబడ్డట్టు వినబడతాయి కాబోలు. దెయ్యం నా మొహంవైపు అదోలా చూసింది.

దెయ్యం అంది: "మనుషుల్లో రెండు రకాల వితండవాదనల వాళ్ళున్నారు. ఒక రకం వాళ్ళసంగతి చెప్పాను. మతాలు కూడా మనుష్యులు స్థాపించినవే అని మర్చిపోయి మాట్లాడతారు రెండోవాళ్ళు. వీరస్వర్గం సంగతి ఎప్పుడూ వినలేదా? యుద్ధభూమిలో చచ్చిపోతే వీరస్వర్గం లభిస్తుందని, ఇంకా ఏవేవో లాభాలుంటాయని చెప్పేరకాలు వీళు. నేను మనిషినైపుట్టను, మనిషిగా. పెరిగాను మనిషిగా చచ్చి, దెయ్యమైయ్యాను. చెబుతున్నాను విను: పుట్టినవాడు చావడం ఎంతతథ్యమో, చచ్చినవాడు దెయ్యమవడం అంత తథ్యం...వీరస్వర్గం కాదు; నా తలకాయ్" అంది దెయ్యం.

"నీ మొహం నువ్వూను—వెధవ వాదన" అనుకొన్నాను — మనస్సులో. మాటలు పైకన్నా లోపలనుకున్నా ఒకటే కాబోలు యీ దెయ్యాల దగ్గిర. దెయ్యం నా మొహంవైపు అదోలా చూసింది మళ్లీ.

దెయ్యం అంది: "నాకూడా నీలాగే దెయ్యాల్లో నమ్మకం ఉండేది కాదు. ఓరోజున గడ్డం గీసుకొంటూంటే పాళ లేదు తెగింది. గాయమైంది. 'ఏంటిసెపిక్' ఏమైనా వాడదామనుకున్నాగాని. అశ్రద్ధ చేశా. లేబరేటరీలో ఓసారి ఎక్స్పెరిమెంటు చేసున్నా. టెస్ట్‌ట్యూబ్‌లో కెమికల్ లిక్విడ్ పోసి, బర్నర్ మీద కాలుస్తూంటే, చేయిజారి టెస్ట్‌ట్యూబ్ బ్రద్దలై లిక్విడ్ ఒంటిమీద బట్టలమీద పడింది. అంతే! కొద్దిరోజుల్లోనే చచ్చిపోయాను."

దెయ్యం మొహంలోకి చూస్తూంటే, అది చెప్పిందంతా నిజమే అయ్యుండాలి అనిపించింది. "ఐతే — ఇది నిజంగా దెయ్యమే" అనుకున్నాను — మనస్సులో. రేడియోలోలా వినిపించుండాలి. దెయ్యం నవ్వింది. పళ్లన్నీ తెల్లగా ఉన్నాయి. వేపకొమ్మలమీద వేలాడ్డంవల్ల కూడా కొన్ని లాభాలుంటాయి కాబోలు.

పరధ్యానంగా సిగరెట్టుతీసి వెలిగించుకున్నాను. "కాసేపు సిగరెట్ కాలవకుండా ఉండలేవా, బ్రదర్?" అంది దెయ్యం.

"సారీ" అని సిగరెట్టు ఆర్పేశాను.

"అసలు నేను చాలా అందంగా ఉండేవాడినని నానమ్మకం. చచ్చిపోయిన కొంతసేపటివరకు చచ్చిపోయానన్న సంగతి గ్రహించలేదు. పంజరం తలుపు తెరిచిన పక్షిలా ఇలంతా ఎగురుతూ తిరిగాను. ఆ తిరుగుతూన్నప్పుడే నాకు నేను కనుపించాను. అంతకుముందు అద్దంలో తప్ప ఎప్పుడూ నా మొహం చూసుకోలేదు. 'ఇంత భయంకరంగా ఉందేమిటి నా మొహం' అనుకున్నాను. అప్పుడు హఠాత్తుగా తట్టింది చచ్చిపోయానేమో నని. మరి నేను నిజంగా



కేసరికుటీరం ప్రైవేట్ లిమిటెడ్
రాయపేట, మద్రాసు-14
ఆంధ్రప్రదేశ్ ఏజంట్లు:
మెసర్సు సీతారామ్‌జనరల్‌స్టోర్సు ఏజెన్సీస్
విజయవాడ, సికిందరాబాదు.

చచ్చిపోతే—మరి యీ వేసవికి? అనుకున్నాను. దెయ్యాన్ని. దశాబ్దాలుగా దెయ్యాల్లో నమ్మకంలేని నాకు, హఠాత్తుగా నమ్మకం కలిగింది. నాపరిస్థితికి నాకే ఆశ్చర్యం వేసింది. ఆలోచిస్తూవెళ్ళి, గోడకి మేకొకటి ఖాళీగావుంటే, దానికి తగిలి నిలబడ్డాను."

దెయ్యం పరధ్యానంగా గోడకున్న మేకు దగ్గరికివెళ్ళి, దానికి తగులుకు కూచుంది.

"ఈలోగా అక్కడికి శంకరంవచ్చాడు. కుమిలి కుమిలి ఏడ్చాడు. ఆ సాయంత్రమే సంతాపసభ జరిగిందట. నేను వెళ్ళడానికి వీల్లేకపోయింది. ఇకముందు నేను వేపకొమ్మలమీద వేలాడవలసిన దాన్ని. నువ్వు చెబితే నమ్మకపోవచ్చుగాని ఉండడానికి ఇల్లు దొరకడం ఎంతకష్టమో, వేలాడ్డానికి వేపకొమ్మలు దొరకడం అంత కష్టం. మనుషుల లోకంలో రెంట్ కంట్రోల్ ఏక్టులంటూ ఉంటాయి. దెయ్యాలలోకంలో అటువంటివి ఏవీ లేవు. పైగా—పలుదోము పుల్లలంటూ వేపకొమ్మలు, రెమ్మలు కొట్టేస్తూంటారు మనుష్యులు. ఏ చెయ్యో కొమ్మో విరుగుతుందేమో అన్నభయం కూడా వేస్తూంటుంది. ఎంత చలేస్తూన్నా, పొద్దున్న పూట కాళ్ళు ముడుచుకోడానికి వీల్లేదు... దెయ్యాల కూడా చలేస్తుంది తెలుసా?" హఠాత్తుగా ప్రశ్నించింది దెయ్యం.

"తెలుసు" అన్నాను నేను.


"ఏం తెలుసు, నీ మొహం?" అంది దెయ్యం.

"తెలియదు" అన్నాను నేను.

దెయ్యం నవ్వింది. "తమాషా మనిషివే నే, నువ్వు!" అంది నా భుజంమీద చెయ్యేసి. "ఏయ్! చెయ్యి తీశేయ్ అక్కడ" అన్నాను మొదట. "చెయ్యి తీసెయ్యండీ మరీ" అన్నాను తర్వాత. దెయ్యం చెయ్యి తీసేసింది. "ఎంతవరకు చెప్పాను?" అంది.

"నువ్వు-మీరు చచ్చిపోయి నందుకు సంతాపసభ జరిగింది..."

"ఔను సంతాపసభ జరిగింది. వేపచెట్టు వెతుక్కోడానికి పోవడంవల్ల సభకి హాజరు కాలేకపోయా. మర్నాడు పత్రికల్లో చదివాను వార్తలు. 'ఆంధ్రపత్రిక'లో అడ్డంగా ఇంత పొడుగున వేసి, ఫొటోకూడా వేశారు. సభలో అందరూ నన్ను పొగుడుతూ మాటాడారు. అవన్నీ చదువుతూంటే చచ్చేటంత సిగ్గేసింది. సంతాప తీర్మానం చేస్తామంటే మాశంకరం ససేమిరా వీల్లేదంటే వీల్లే దన్నాట్ట. 'వెంకటేశ్వర్రావ్ బ్రతికుండగా ఆత్మ నేది ఒకటుంటుందని ఎప్పుడూ ఒప్పుకోలేదు. చచ్చిపోయిన తర్వాత దేహంలో అణువులన్నీ పంచభూతాల్లో కలిసిపోతాయని మాఇద్దరి ఉద్దేశ్యం. అతనికిగాని నాకుగాని ఆత్మలో విశ్వాసంలేదు. అతని ఆత్మకు ...కై తీర్మానం పనికిరాదు' అని






శుద్ధమైన మైసూర్ మంచి గంధం నూనె, తురగాయల నూనెల నుంచి తయారుచేయబడిన సబ్బులో చేర్చబడుటవల్ల గోద్రెజ్ సాండల్ సబ్బు సాటిలేని శ్రేష్ఠమైనదై యున్నది.

అది తక్షణం సమృద్ధయిన నురగ నిచ్చి మీ చర్మమునకు హాయిగా నుండు చల్లదనమును గలిగించును. దాని అసలైన సువాసననిల వుండును ... మిమ్ములను సువాసనైన సొగసుతో హాయిగాను మనోల్లాసము గాను వుంచును.

ధరకు తగినవిలువ, ఎత్తుకు సత్తగల గోద్రెజ్ సాండల్ పొదుపైనదికూడ!

గోద్రెజ్ సాండల్ యందు జంతు క్రొవ్వు లేదు.




ఇప్పుడు కొత్త ఆకర్షణీయమైన కాగితంలో వున్నది.

Godrej

గోద్రెజ్ మీ కోసం శ్రేష్ఠమైన సబ్బులను తయారు చేయును. స్నానమునకు, బట్టలుతుకుటకు, క్షౌరమునకు మరియు ఇతర టాయిలెట్రీస్

# ఒకదెయ్యంచెప్పిన రెండుదెయ్యాల కథ

వాదించాడు."

దెయ్యం పొట్టచెక్కలయేటట్టు నవ్వడం ప్రారంభించింది. దెయ్యానికి పొట్టఉందని కాదు చెక్కలవడానికి! మాట వరసకి చెబుతున్నాను. తెరలుతెరలుగా నవ్వడం ప్రారంభించింది. నాకు కోపం వచ్చింది. "ఏమిటా నవ్వు?" అని గద్దించాను. "బయటకిపోయి, నవ్వేసి, మరీరా లోపలికి" అని కోప్పడ్డాను. దెయ్యంకానీండి, మరేం కానీండి. కోపంవస్తే నేను మనిషినికాను. దెయ్యం వంటింటి తలుపులోంచి బయటకు పోయి, పక్కగోడలోంచి లోపలికివచ్చింది "ఐయామ్‌సారీ" అంది ఇంగ్లీషులో.

నాకు నవ్వురావడానికి కారణం ఉంది. శంకరంచేసిన వాదన తమాషాగా ఉంది. 'నిజంగా వెంకటేశ్వరరావు ఈతీర్మానాన్ని గురించి ఏలోకంలో నున్నావింటే మహా బాధ పడతాడు' అని వాదించడం మొదలెటాడు శంకరం. మూర్ఖుడు! నాకు ఆత్మే కనక లేకపోతే, వాళ్ళు తీర్మానంచేసినా ఫరవాలేదు. ఎలాగూ నాకు తెలియదుగా! ఎలాగూ నేనుండనుగా తెలియడానికి! నాకే ఆత్మఉంటే, తీర్మానంచేస్తే మరిచిదేగా? ఇది వాడు గ్రహించలేదు.

"శంకర్రావుకీ, నాకూ బ్రతికుండగా, ఇద్దరం బ్రతికుండగా ఏ అభిప్రాయభేదం ఉండేదికాదు. దెయ్యాలనేవి ఉన్నాయని నేనూ అంగీకరించే వాణ్ణికాదు; అతనూ అంగీకరించే వాడు కాదు. నేను-చచ్చి దెయ్యమయ్యాను. నాకు-దెయ్యాల్లో నమ్మకం కలిగింది. శంకరానికి ఇంకా కలగలేదు. మేమిద్దరం వేర్వేరు లోకాల్లో ఉన్నా ఈ అభిప్రాయభేదాన్ని నేను సహించలేకపోయాను. అతనికికూడా దెయ్యాల్లో నమ్మకం కలిగించాలి అనుకున్నాను.

"ఆరాత్రి శంకర్రావుకి కలలోకనపడ్డాను. నేనతని భుజంతట్టి 'శంకరం!' అన్నాను. శంకరం ఉలిక్కిపడిలేచి కూచున్నాడు. నిజంగాకాదు-కలలో! 'నేను చచ్చిపోయి దెయ్యమైనానోయ్!' అన్నాను. 'నేను నమ్మను కల్లోకూడా నమ్మను!' అన్నాడు శంకరం. 'ఇది కలేనోయ్' అన్నాను. 'కలా? నిజమా? ఇది' అన్నాడు. ఒళ్లు గిల్లుకో నీకే తెలుస్తుంది. ఇది నిజంగా కలే! కాని నిజమేకూడా! నిజంగా నేను దెయ్యాన్నే,' అన్నాను. 'నేను నమ్మను' అన్నాడు కల్లోనే కళ్ళు నులుముకుంటూ. 'రేపొద్దున్న మెలుకువ రాగానే చూడు. ఈ గోడలోంచి నేను వచ్చినగుర్తులు కనపడతాయి. కనపడితే కల నిజమే అని రుజువు. నువ్వు దెయ్యాలు లేవన్నావ్. ఉన్నాయి. నేను దెయ్యాన్నే. రుజువు కనపడితే, కృష్ణమోహన్ ఇంటి వాకిట్లోన్న వేపచెట్టు దగ్గరకురా. అక్కడ నీకోసం వేలాడుతూ ఉంటాను' అన్నాను." దెయ్యం ఆగింది.

"కృష్ణమోహన్ అంటే నేను?" అన్నాను నేను చెమటలు తుడుచుకుంటూ.

"ఔను. ఏం?" అంది దెయ్యం—తీక్షణంగా నావైపు చూస్తూ.

"ఏంలేదు" అన్నాను నేను. ఇంకా ఏదో అందామనుకున్నాను. నోటమాటరాలేదు.

దెయ్యం అంది; "కల పూర్తవగానే వేపచెట్టు దగ్గరికొచ్చి, కొమ్మకు వేలాడ్డం మొదలెట్టాను. కాని నిద్దరాలేదు. అసలే అలిసిసొలిసిఉన్న శంకరాన్ని ఇంతదూరం రమ్మనడం న్యాయంగా కనపడలేదు. పొద్దున్నే లేచి, వేప్పుల్లొకటి నోట్లో పెట్టుకుని-వేప్పుల్ల ముందు నీ టూత్ పేస్టులు పౌడర్లు ఆగుతాయనుకుంటున్నావా? వేప్పుల్ల నోట్లో పెట్టుకొని, బయలుదేరాను. ఇంకా నారాయణగూడా బ్రిడ్జివరకూ పోలేదు. శంకరం కార్లో వేగంగా వస్తూ ఎదురయ్యాడు. నీకు తెలుసో? తెలియదో? దెయ్యాలు ప్రత్యేకం చూస్తేనేగాని కనపడవు. అందుకని వస్తూన్న కారుకడ్డంగా నిలబడి, 'హల్లో, శంకరం!' అన్నాను. శంకరం తెలబోయాడు. స్టీరింగువీలు గిర్రున ఎడమచేతిపక్కకు తిప్పాడు. కారు వంతెనకు కొట్టుకోడం, వంతెనక్రింద మురికికాలవలో పడ్డం, శంకరం కెవ్వన కేకెడ్డం-అన్నీ ఒక్కసారి జరిగాయి. చటుక్కున మురికికాలవలోకి దూకాను. అప్పటికే ఐపోవలసిందంతా ఐపోయింది. 'హల్లో, వెంకట్' అంటూ బయటకు వచ్చింది శంకరం, ముక్కలు ముక్కలైన కార్లోంచి. పోలీసు వాళ్ళు వచ్చేలోగా, ఇద్దరం ఒక్కుఉరెగిరి, గుడిసెలమీదుగాపోయి వేపచెట్టు చేరుకున్నాం."

దెయ్యం పూర్తిచేసింది. నేను నోరుతెరిచి చూస్తున్నాను. వెంకటేశ్వర్రావుది దెయ్యం వైపుకాదు, కిటికీలోంచి తలకాయదూర్చి చూస్తూన్న మరో ఆకారంవైపు. 'హలో, వెంకట్' అంటూ ఆ ఆకారం లోపలికి వచ్చింది.

వెంకట్ శంకరాన్ని పరిచయంచేసింది. సంతోషంతో కన్నీళ్ళు కార్చింది. నీళ్ళు కాదు; రాళ్ళు. దెయ్యాలు రెండూ కౌగలించుకున్నాయి. "ఎక్కడకు పోయావ్, శంకూ?" అంది కళ్ళమ్మట రాళ్ళు కారుస్తూ వెంకట్. "అదంతా ఓ పెద్దకథలే. తరువాత ఎప్పుడన్నా చెబుతాలే. ఈ మురికికాలవ పక్కనే హిమాయత్‌నగర్‌లో ఒక వేపచెట్టు చూసొచ్చాను. రెండేరెండు కొమ్మలు ఖాళీగాఉన్నాయ్. బాగా నేఉన్నాయ్. ఆలస్యంచేస్తే అవికూడా పోతాయ్ ఏమంటావ్?" అంది శంకరం.


"ఓ. కే. గుడ్ నైట్" అంది నన్నుచూసి వెంకట్.

"గ్లేడ్ టు హేవ్ మెట్ యు" అంది శంకరం.

రెండు దెయ్యాలు "టా, టా" అంటూ కిటికీఊచల్లోంచి బయటకు పోయాయి. నేను పడక్కుర్చీలో మళ్ళా కూలబడ్డాను. సిగరెట్టు అంటించుకున్నాను. ఇంతలో హఠాత్తుగా ఓ సందేహంకలిగింది. కిటికీదగ్గరకి పరుగెత్తాను. వెన్నెల్లో దూరంగా కంఠాలు వినిపిస్తున్నాయి. "ఏయ్! శంకూ! వెంకట్!" అని అరిచాను. "క్యా?" అంది వెంకట్ కంఠం దూరంగా. "మీ అభిప్రాయభేదాల సంగతి ఏమైంది?" అని అరిచాను. "తీరిపోయాయిగా?" అని అరిచింది వెంకట్ కంఠం దూరంనుంచి.

నేను కిటికీదగ్గరే నిలబడి, వెన్నెల్లోకి పరధ్యానంగా చూస్తున్నాను. అలా ఎలా నిలబడేవాణ్నో తెలియదు. పైన వేపచెట్టు కొమ్మలు కదిలిన చప్పుడైంది. "ఏయ్!" అందో కంఠం. ముసలికంఠం. ఎండిపోయిన కంఠం. నేను పైకిచూశాను.

"కాసేపు సిగరెట్లు కాలకుండా ఉండలేవ్? ఆ సిగరెట్ ఆర్పేసి పోయిపడుకో" అందా కంఠం, ముసలికంఠం, విసుగ్గా. వేపకొమ్మలు మళ్ళీ మూసుకుపోయాయ్. వెన్నెలే మిగిలింది. ★



"నాభుక్తికి సరిపడ నేను ఎందుకుసంపాదించుకోకూడదనేనా మీరనేది? నాలాంటి లఫంగ్‌కు ఒక అర్హతకూడా?!"